క్లుప్తంగా

కౌలు రైతులకు రుణాలు



మాట్లాడుతున్న ఎల్‌డీఎం రామచంద్రరావు

కోడుమూరు రూరల్‌: పొలాలను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులందరికీ రుణాలు ఇప్పిస్తామని ఎల్‌డీఎం రామచంద్రరావు సూచించారు. మండలంలోని కోడుమూరు, ఎర్రదొడ్డి, గోరంట్ల, ప్యాలకుర్తి గ్రామాల్లో గురువారం కౌలు రైతులకు మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్‌ ఆధ్వర్యంలో పంట రుణాల మంజూరుపై గ్రామ సభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా లీడ్‌ బ్యాంకు మేనేజర్‌ రామచంద్రరావు హాజరయ్యారు. ఎల్‌డీఎం మాట్లాడుతూ.. కౌలు రైతులకు పంట రుణాలిప్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. భూముల సొంతదారులు రుణాలు తీసుకోకుండా ఉండి ఉంటే అలాంటి భూములను కౌలుకు తీసుకున్న రైతులందరికీ ఆయా బ్యాంకుల్లో రుణాలిప్పిస్తామన్నారు. ఏఈఓ బాలకృష్ణ, ఆయా రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు చెందిన దివ్యశ్రీ జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసయాదవ్‌ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. డిసెంబర్‌ 16వ తేదీన విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్‌–14 సైక్లింగ్‌ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు జార్ఖండ్‌ రాష్ట్రంలోని రాంచీలో జరిగే జాతీయ స్థాయి సైక్లింగ్‌ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పా రు. తమ పాఠశాల విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు వెళుతున్న సందర్భంగా ఉపాధ్యాయ బృందం అభినందిస్తూ ప్రయాణ ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు శేఖర్‌, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు: కిశోరి వికాసం కార్యక్రమంపై గురువారం కల్లూరు మండల పరిషత్‌ కార్యాలయ సమావేశ భవనంలో ఐసీడీఎస్‌ కర్నూలు ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీపీ నాగేశాచలరెడ్డి, ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి హాజరై బాలల హక్కులు, విద్యా హక్కుల గురించి వివరించా రు. కిశోరిలకు ప్రభుత్వం అందిస్తున్న కార్యక్ర మాలను వివరించారు. పాఠశాలల ఉపాధ్యాయులు, ఐసీడీఎస్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛన్లపై తనిఖీ



కోడుమూరులో పింఛన్‌దారురాలి స్థితిగతులను పరిశీలిస్తున్న వైద్య బృందం సభ్యులు

కోడుమూరు రూరల్‌: మండలంలో మంచానికి పరిమితమై రూ.15 వేల పింఛన్‌ పొందుతున్న లబ్ధిదారుల స్థితిగతులను జిల్లా వైద్య బృందం సభ్యులు గురువారం తనిఖీ చేశారు. మండలంలోని కోడుమూరు, ఎర్రదొడ్డి, లద్దగిరి గ్రామాల్లో వైద్య బృందం సభ్యులు పర్యటించి పింఛన్‌దారుల వివరాలను పరిశీలించడంతో పాటు, వారి స్థితిగతులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మండలంలో మొత్తం 8 మంది దివ్యాంగ పింఛన్‌దారులకుగాను 7 మంది లబ్ధిదారుల స్థితిగతులను వైద్యం బృందం సభ్యులు పరిశీలించారని, మరొక లబ్ధిదారుడు అందుబాటులో లేకపోవడంతో వివరాలను పరిశీలించలేదని ఎంపీడీఓ రాముడు పేర్కొన్నారు.

బీఈడీ నాలుగో సెమిస్టర్‌ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్‌: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన బీఈడీ నాలుగో సెమిస్టర్‌ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్‌ ఆఫ్‌ ఎగ్జామినేషన్స్‌ డాక్టర్‌ ఎస్‌.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి వైస్‌ చాన్సలర్‌ ప్రొఫెసర్‌ ఎన్‌టీకే నాయక్‌ ఆదేశాల మేరకు ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. రెగ్యులర్‌ విద్యార్థులు 2647 మంది పరీక్షలు రాయగా 2499 మంది, సప్లిమెంటరీ పరీక్షలను 370 మంది రాయగా 342 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఫలితాలు https://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

ముక్కోటి ఏకాదశి వేడుకలకు సిద్ధం

- ఆలయాల్లో స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు
- భక్తులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు





బిలకలగూడూరు సమీపంలోని బాలాజీ టెంపుల్‌ (ఇన్‌సెట్‌) ఆలయంలో వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌

గడివేముల: ఏడాదికి ఒక్కసారి వచ్చే ముక్కోటి (వైకుంఠ) ఏకాదశికి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామ సమీపంలో జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్మించిన బాలాజీ ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి కావడంతో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణంలో పచ్చటి చెట్లతో స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆలయం చుట్టూ కోనేర్లు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఉత్తర ద్వారం నుంచి ప్రవేశించి వేంకటేశ్వరుడిని దర్శించుకుంటే పాపహరణంతో పాటు సకల సౌభాగ్యాలు కలుగుతాయని ఆలయ నిర్వాహకులు గురవారం తెలిపారు. జిందాల్‌ యాజమాన్యం ఉత్తరం ద్వారం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పెసరవాయి, బూజునూరు, కొరటమద్ది గ్రామాల్లోని వేంకటేశ్వర స్వామి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నందుల కోటలో కలియుగ దైవం

నంద్యాల జిల్లా చారిత్రక ప్రసిద్ధి చెందిన ఆలయాలకు నిలయం. నందన మహారాజు, చాణుక్య రాజులతో పాటు శ్రీకృష్ణ దేవరాయలు పాలించారు. నంది ఆలయాల పేరుతో ఎంతో ప్రసిద్ధి చెందిన నంద్యాల జిల్లాలో శ్రీశైలం, మహానంది, యాగంటి లాంటి శైవ క్షేత్రాలతో పాటు అహోబిలం, రంగాపురం మద్దిలేటి స్వామి లాంటి వైష్ణవ పుణ్యక్షేత్రాలు సైతం దినదినాభివృద్ధి చెందుతున్నాయి. నందుల కోటగా ప్రసిద్ధి చెందిన నంద్యాల జిల్లా గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామ సమీపంలో కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరుడి బాలాజీ ఆలయం ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుంది. ఒకప్పుడు రాళ్ల రప్పలతో ఉన్న ఈ ప్రాంతం నేడు పచ్చటి అందాలతో పాటు ఆధ్యాత్మికతతో విరాజిల్లుతోంది. 10వ శతాబ్దపు తిరుమల తరహాలో జిందాల్‌ కంపెనీ నిర్మించిన బాలాజీ ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా రోజురోజుకు ప్రసిద్ధి చెందుతోంది. అచ్చం తిరుమల నమూనాలో వేంకటేశ్వరుడి వైభవం, వరాహస్వామి విశిష్టత, పుష్కరిణి సైతం సుందరంగా తీర్చిదిద్దారు.

బాలాజీ ఆలయం ప్రత్యేకత

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌ కంపెనీ నిర్మించిన బాలాజీ దేవాలయం బ్లాక్‌ లైమ్‌స్టోన్‌ వినియోగించి 2.5 ఎకరాల స్థలంలో నిర్మించారు. ఆలయ నిర్మాణ శైలి మహోన్నత భారతీయ దేవాలయ శిల్పకళా చాతుర్యతను చాటేలా ఉంటుంది. ఈ ఆలయ డిజైన్‌ 10వ శతాబ్దం నుంచి ఉన్న తిరుపతిలోని బాలాజీ దేవాలయం నమూనాను పోలి ఉండేలా తీర్చిదిద్దారు. బాలాజీ దేవాలయంలో వేంకటేశ్వరస్వామి, వరాహస్వామి ప్రతిమలు బ్లాక్‌ లైమ్‌స్టోన్‌ జిగ్గారూట్స్‌లా ఉంటాయి. బాలాజీ దేవాలయ ప్రాజెక్టుకు అనూశ్రీ జిందాల్‌ నేతృత్వం వహించారు. భారతీయ ఆర్కిటెక్ట్‌ సమీప్‌ పదోరా అండ్‌ అసోసియేట్స్‌ దీనికి ముఖ్య ఆర్కిటెక్ట్‌గా పనిచేశారు. జేఎస్‌డబ్ల్యూ సీఎస్‌ఆర్‌ నిధులు రూ.5 కోట్లు సమకూర్చడంతో ఈ దేవాలయాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించి నంద్యాల ప్రజలకు అంకితం చేశారు. ఈ ఆలయ ప్రాజెక్ట్‌ ద్వారా జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌ లక్ష్యం, ఆలయానికి సంబంధించి ప్రజల సాంస్కృతిక అంచనాలను అందుకోవడం, ఎన్నో సంవత్సరాలుగా నీటి వనరుల లభ్యత తక్కువ కావడంతో ఎడారిలా మా రుతున్న ప్రాంతంలో దానిని పునరుద్ధరించడం జరిగింది. భక్తులు, ప్రజలు ఆలయ ప్రాంగణం అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటున్నారు.

ఆలయానికి ఇలా చేరుకోవాలి

నంద్యాల నుంచి బిలకలగూడూరు బాలాజీ టెంపుల్‌కు 30 కిలోమీటర్ల దూరం ఉంటుంది. కర్నూలు నుంచి నందికొట్కూరు మీదుగా గడివేముల వయా బాలాజీ దేవాలయానికి చేరుకోవడానికి 65 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇక్కడికి నిరంతరం బస్సులు అందుబాటులో ఉంటాయి.



వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు



ఆలయ ప్రాంగణంలో పచ్చిక



కొరటమద్దిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు



విద్యుద్దీపాల వెలుగులో క్రిష్ణదొడ్డిలోని కోనవేంకటేశ్వర స్వామి ఆలయం

ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు



సి.బెళగల్‌: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలోని ఆయా గ్రామాలలోని ఆలయాలు సర్వాగ సుందరంగా సిద్ధమయ్యాయి. శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండల కేంద్రం సి.బెళగల్లోని కొటారుమిట్టలో కొలువైన రంగనాథ ఆలయం, అదేవిధంగా కృష్ణదొడ్డి గ్రామంలో కొండపై వెలసిన కోన వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాలను రంగురంగుల విద్యుత్‌ బల్బులతో సుందరంగా అలంకరించారు. అలాగే గుండ్రేవుల గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో కొలువైన వేంకటేశ్వర స్వామి, గొల్లలదొడ్డి గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయంలోని శ్రీ కృష్ణుడిని భక్తులు ఉత్తర ద్వారం గుండా దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు.



సి.బెళగల్‌ రంగనాథ ఆలయంలో మూల విరాట్‌ను సిద్ధం చేస్తున్న భక్తుడు

భవిష్యత్‌ బాగుండాలంటే బాగా చదవాలి



కబడ్డీ విజేతలకు బహుమతులను అందజేస్తున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

గడివేముల: భవిష్యత్‌ బాగుండాలంటే బాగా చదవాలని విద్యార్థులకు నంద్యాల జిల్లా డీఈఓ జనార్దన్‌ రెడ్డి సూచించారు. గడివేముల జెడ్పీ స్కూల్‌ నందు జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం డీఈఓ చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. జేఎస్‌డబ్ల్యూ యాజమాన్యం క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ప్రతి ఏడాది ఇలాంటి క్రీడలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఉల్లాసం, ఉత్సాహం ఉంటుందన్నారు. అనంతరం మండల స్థాయి క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు కప్పులను అందజేశారు. మోడల్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ శైలజ, సీఎస్‌ఆర్‌ మేనేజర్‌ రవికుమార్‌, హెచ్‌ఎం విక్టర్‌ ఇమ్మానియేల్‌, పీఈటీలు భుజంగరావు, ఎల్ల రాముడు, కవిత, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇచ్చే వరకు పోరాటం



మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్‌



కల్లూరు: తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్‌: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇచ్చే వరకు ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్‌ అన్నారు. గురువారం గూడూరు మండలంలోని చనుగొండ్లలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవుల శేఖర్‌ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు సాయం అందించాలని డిమాండ్‌ చేశారు. ఇళ్లు, స్థలాల కోసం ఈ నెల 10న గూడూరు తహసీల్దార్‌ కార్యాలయం వద్ద నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్‌, మండల కార్యదర్శి శ్రీనివాసులు, స్థానిక నాయకులు బాలు, బాలకృష్ణ, దస్తగిరి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి

కల్లూరు: పేదలకు సొంతింటి కల నెరవేరే దాక సీపీఐ పోరాటం ఆగదని ఆ పార్టీ నాయకులు డిమాండ్‌ చేశారు. గురువారం సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షతన, కర్నూలు నగర సమితి ఆధ్వర్యంలో కల్లూరు తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇస్తానని హామీ ఇచ్చారని, వాటిని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్‌ అంజనేయులకు వినతి పత్రమిచ్చారు. సీపీఐ నాయకులు మహేష్‌, నాగరాజు, సోమన్న, మల్లన్న, నాగేశమ్మ, రబీయా, రాముడు తదితరులు పాల్గొన్నారు.

శివదీక్ష మహోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

కల్లూరు: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ (యాగంటి స్వామి రూరల్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ సెక్రటరీ) గురువారం వారి స్వగృహంలో శివదీక్ష మహోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. బనగానపల్లె మండలం, నంద్యాల జిల్లాలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి వార్ల దేవస్థానం యాగంటి క్షేత్రంలో శివదీక్షను స్వీకరించి శివానుగ్రహము పొందాలన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు

రోల్‌బాల్‌ పోటీలు ప్రారంభం



రోల్‌బాల్‌ పోటీలో తలపడుతున్న జట్లు

కర్నూలు (టౌన్‌): నగర శివారులోని లక్ష్మీపురం వద్ద ఉన్న రిడ్జ్‌ పాఠశాలలో గురువారం సాయంత్రం 16వ జాతీయ జూనియర్‌ రోల్‌ బాల్‌ పోటీలు ప్రారంభమయ్యాయి. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రోల్‌బాల్‌ పోటీల్లో దేశంలోని 20 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నట్లు చెప్పారు. రోల్‌బాల్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా అధ్యక్షుడు జి.చంద్రమౌళి మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు పోటీలు ఉంటాయని తెలిపారు. సీఈఓలు గోపీనాథ్‌, సౌమ్య, ప్రిన్సిపాల్‌ రాజ్‌కమల్‌, నిర్వాహకులు సునీల్‌ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం

పాణ్యం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు వీరనారాయణస్వామి ఆలయ ఈఓ సువర్ణ గురువారం తెలిపారు. ఈఓ మాట్లాడుతూ.. పాణ్యంలోని వీరనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

కురువలను ఎస్సీలో చేర్చొద్దని వినతి



సి.బెళగల్‌లో డీటీ పురుషోత్తంకు వినతిపత్రం ఇస్తున్న గొల్లలదొడ్డి వాసులు

సి.బెళగల్‌: కురువ కులస్తులకు ఎస్సీ జాబితాలో చేర్చరాదని గొల్లలదొడ్డి వాసులు తహసీల్దార్‌ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. గురువారం గ్రామానికి చెందిన నల్లన్న, రవికుమార్‌, లక్ష్మి, చంద్రయ్య తదితరులు మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయానికి చేరుకుని జూనియర్‌ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో మాదాసి/మాదారి కురువలు ఎస్సీ కులం సర్టిఫికెట్లు అడుగుతున్నారని, అలాంటి వారికి ఎస్సీ కుల సర్టిఫికెట్లు జారీ కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో దేవేంద్ర, దామోదర్‌, రాఘవేంద్ర, తిక్కరాజు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పీస్‌ కాన్ఫరెన్స్‌

కర్నూలు కల్చరల్‌: టీజీవీ ఫైన్‌ ఆర్ట్స్‌ అకాడమీ ప్రథమ వార్షికోత్సవం, నృత్య జ్యోతి ఫైన్‌ ఆర్ట్స్‌ అకాడమీ 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని నగర శివారులోని ఇండస్‌ పాఠశాలలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు సౌత్‌ ఏషియన్‌ పీస్‌ కాన్ఫరెన్స్‌ నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు భార్గవకుమార్‌ తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇంటర్నేషనల్‌ యూత్‌ కల్చరల్‌ ఫెస్టివల్‌ జరుగుతుందని పేర్కొన్నారు. సుమారు 20 రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కళాకారులతో పాటు విదేశాలకు చెందిన కళాకారులు ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు.

నృత్య పోటీలు

కర్నూలు కల్చరల్‌: కళా సౌరభ 10వ వార్షికోత్సవం పురస్కరించుకొని శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు సీక్యాంప్‌ టీజీవీ కళాక్షేత్రంలో జాతీయస్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీ నటరాజ నృత్య కళా మందిర్‌ నిర్వాహకులు కరీముల్లా తెలిపారు. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పలు రాష్ట్రాలకు చెందిన కళాకారులు పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. పోటీలో మొదటి రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు, మిగతా రెండు రోజులు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు పోటీలు ఉంటాయని వెల్లడించారు.

నేడు జాబ్‌మేళా

కర్నూలు(సెంట్రల్‌): బిర్లాగేటు పోస్టాఫీసు ఎదురుగా ఉన్న ఎస్‌ఏసీ శిక్షణ కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పి.దీప్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎల్‌ఐసీ, అమరాజా కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారని చెప్పారు. 15 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని, విద్యార్హత జిరాక్స్‌ కాపీలు, రెండు ఫొటోలు, ఆధార్‌ కార్డుతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుందని వెల్లడించారు.

స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలి



ఓర్వకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సీఈఓ నాసరరెడ్డి

ఓర్వకల్లు: కాల్వబుగ్గ సీపీడబ్ల్యూఎస్‌ పథకం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాల ని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కాల్వబుగ్గ సీపీడబ్ల్యూఎస్‌ పథకాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పథకం నిర్వహ ణ, నాణ్యతా ప్రమాణాలపై సంబంధిత అధికారు లు, సర్పంచులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నాసరరెడ్డి మాట్లాడుతూ.. కాల్వబుగ్గ పథకం ద్వారా నీటి సరఫరా జరుగుతున్న కాల్వ, సోమయాలజు పల్లె, ఓర్వకల్లు, హుసేనాపురం, తిప్పాయపల్లె, ఎన్‌.కొంతలపాడు, గుట్టపాడు గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో సమావేశమై నీటి విడుదలపై చర్చించారు. ఈ పథకంలో నీటి స్వచ్ఛతపై ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులు సమగ్ర చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎస్‌ఎస్‌ఎం ఈ–సర్వే, మిస్సింగ్‌ సిటిజన్‌, పీఏసీఎస్‌ ఈ–కేవైసీ సర్వేలపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి రెండు రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయాన్ని సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. గత రెండేళ్లగా మండల పరిషత్‌ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. మండల పరిషత్‌ ఆడిట్‌లో పెండింగ్‌ అభ్యంతరాలపై నివేదికలు తయారు చేసి, సంబంధిత అధికారులకు పంపాలని ఆదేశించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్‌ డీఈ అమల, ఏఈ లోకేశ్వరి, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓ తనిఖీ

కర్నూలు(రూరల్‌): స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని గురువారం జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీలలో చేతి పంపుల నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణకు పంచాయతీ కార్యాలయంలో, మండల పరిషత్‌ కార్యాలయంలో సంబంధిత సిబ్బంది ఫోన్‌ నంబర్‌ను డిస్‌ప్లే చేయాలని సూచించారు. ఎంపీడీఓ రఘునాథ్‌, పరిపాలనా అధికారి చంద్రశేఖర్‌ రేడ్డి, మండల పరిషత్‌ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులున్న మందులనే అమ్మాలి



సి.బెళగల్‌లో ఫర్టిలైజర్‌ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్‌

సి.బెళగల్‌: పెస్టిసైడ్స్‌, ఫర్టిలైజర్‌ దుకాణాల యజమానులు ప్రభుత్వ అనుమతులున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మాత్రమే అమ్మాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్‌ ఆదేశించారు. ఆయన గురువారం మండల కేంద్రం సి.బెళగల్‌లోని పలు ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా దుకాణాలలో అనుమతులు, నిల్వలు, అమ్మకాల రికార్డులను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఓ దుకాణ యజమానులతో మాట్లాడుతూ.. అనుమతులు లేని వస్తువులను అమ్మితే క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తామని, ఎంఆర్‌పీ ధరకే ఎరువులు, విత్తనాలను విక్రయించాలని, అమ్మిన ప్రతి వస్తువుకు బిల్లులను రైతులకు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అదేవిధంగా నిల్వలు, అమ్మకాల రికార్డులను సైతం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, డీలర్లు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించండి



సి.బెళగల్‌ తహసీల్దార్‌ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ సందీప్‌

సి.బెళగల్‌: మండలాలు, గ్రామాల్లోని రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి అవసరమైన సేవలు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కర్నూలు ఆర్డీఓ సందీప్‌ ఆదేశించారు. ఆయన శుక్రవారం సి.బెళగల్‌ తహసీల్దార్‌ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులు, రిపోర్టులు, సేవల వివరాలను డిప్యూటీ తహసీల్దార్‌ పురుషోత్తంను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి వచ్చే భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్‌)లో వచ్చిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలని, క్యాస్ట్‌, ఇన్‌కమ్‌ వంటి సర్టిఫికెట్ల జారీ పెండింగ్‌ లేకుండా చూడాలని మండల రెవెన్యూ అధికారులు ఆదేశించారు. అదేవిధంగా భూముల రీసర్వే నివేదికలు పకడ్బందీగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మహేష్‌

కర్నూలు కల్చరల్‌: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలను తక్షణమే చెల్లించాలని రిపబ్లికన్‌ స్టూడెంట్‌ ఫెడరేషన్‌ జిల్లా కార్యదర్శి మహేష్‌ డిమాండ్‌ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో.. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేకపోయిందని ఆరోపించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.3,580 కోట్ల బకాయిలను చెల్లిస్తామని చెప్పి ఇప్పుడు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రీయింబర్స్‌మెంట్‌ చెల్లించని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. నగర అధ్యక్షుడు మధు, నాయకులు వేదప్రకాష్‌, రవి, ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.